క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

పత్తికొండ రూరల్: సెబ్ స్టేషన్ పరిధిలో నాటుసారా, అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలకు బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ ప్రశాంత్ విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆసక్తి గల వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునన్నారు. వేలంలో వాహనం దక్కించుకోని వారికి సొమ్ము తిరిగి ఇవ్వబడుతుందన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించండి

హొళగుంద: మేజర్ గ్రామ పంచాయతీకి ప్రజలు అన్ని రకాల పన్నులతో పాటు పాత మొండి బకాయిలు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఇంటి, కొళాయి పన్నులు, లైసెన్స్ రిన్యూవల్‌లు, బంకు ఎంక్రోచ్‌మెంట్ తదితర అన్ని రకాలు పన్నులు చెల్లించాలని కోరారు. పన్నులు కట్టకపోతే నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంట దిగుబడులకు మద్దతు ధర

ఎమ్మిగనూరు: రైతులు పండించిన దిగుబడులకు ఈయేడు మంచి ధరలు లభిస్తున్నాయి. అంతర్జాతీయ ఒడిదుడుకులతో పత్తి ధరలు దాగుడుమూతల చందంగా మారుతున్నా మిగతా పంటలకు మద్దతుకు మించిన ధరలే లభిస్తున్నాయి. మంగళవారం ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో 188 మంది రైతులు 1,319 క్వింటాళ్ల వేరుశనగను విక్రయానికి తెచ్చారు. వేరుశనగ మద్దతు ధర కింటాలుకు రూ.5,550 కాగా మార్కెట్ యార్డులో అత్యధికంగా రూ.8,350 పలికింది. ఆముదాలు రూ.6,450, కందులు రూ.6,730, శనగలు రూ.4,430, పూల విత్తనాలు రూ.4,090లకు అమ్ముడుపోయాయి. జిన్నింగ్ మిల్లుల్లో పత్తిని రూ.7,500లకు కొనుగోలు చేశారు.

టెంకాయల విక్రయ హక్కుల వేలం

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన బడేసాహెబ్ తాత ఉరుసు సందర్భంగా దర్గా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం టెంకాయల విక్రమ హక్కుల వేలం పాట నిర్వహించారు. దర్గా ధర్మకర్త కుబేర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుమల రెడ్డి, సర్పంచ్ తోలు రాముడు, పూల బాషా హాజరయ్యారు. ఎమ్మిగనూరుకు చెందిన వీరేష్ అనే టెంకాయల వ్యాపారి రూ.3.80 లక్షలకు వేలం పాడి హక్కులను దక్కించుకున్నారు. మల్లేష్, విజయ్, మీసాల రామన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల మోసాలపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: తూకాల్లో రైతులను మోసం చేస్తున్న పత్తి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట పత్తి కొనుగోలు దుకాణాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసే కొందరు తూకాల్లో మోసాలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. క్వింటానికి పది కేజీల వరకు తగ్గించి మోసం చేస్తుండటంతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఈ మోసాలను అరికట్టేందుకు తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డును బాగు చేయండి

హొళగుంద: స్థానిక వీరశైవ లింగాయత్, హిందూ శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో అంత్యక్రియలకు వెళ్లే వారు ఇబ్బందులు పడ్తున్నారు. రాళ్లు రప్పలు తేలి గుంతలు పడడంతో వృద్ధులు ఆ దారిలో నడవలేక పోతున్నారు. అలాగే సమీప కాలనీ వాసులు ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. చీకటిలో చాలా మంది కింద పడి గాయాల పాలైన సంఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి పెద్ద చెరువు వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

గోశాలకు భూమి పూజ

ఆస్పరి: ఆస్పరిలోని మారెమ్మవ్వ ఆలయం వద్ద మంగళవారం గోశాల నిర్మాణానికి సర్పంచ్ మూలింటి రాధమ్మ భూమి పూజ చేశారు. మారెమ్మవ్వకు దాతలు సమర్పించిన ఆవులను సంరక్షించేందుకు గోశాల నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ చెప్పారు. కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, సొసైటీ మాజీ చైర్మన్ కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన పంచాయతీ వేలాలు

వెల్దుర్తి: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని పాతబస్టాండులో దివంగత చెరుకులపాడు నారాయణరెడ్డి కాంప్లెక్స్‌లోని 13 దుకాణాలకు వేలాలు మంగళవారం ముగిశాయి. ఈఓఆర్డీ నరసింహులు ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన వేలాలకు డీఎల్‌పీఓ తిమ్మక్క హాజరయ్యారు. కాంప్లెక్స్‌లో కింది వైపు ఉన్న 7 దుకాణాలను వేలందారులు గతేడాది కంటే రూ.39,600 హెచ్చు పాడి దక్కించుకున్నారు. ఆయా దుకాణాల ద్వారా రూ.4,39,200 ఆదాయం సమకూరినట్లు ఈఓ జేమ్స్ కృపవరం తెలిపారు. కాంప్లెక్స్‌లో పైనున్న 8 దుకాణాలకు వేలందారులు ముందుకు రాకపోవడంతో వాటి వేలాలు వాయిదా వేశారు.

విజయానికి సహకరించండి

మద్దికెర: పశ్చిమ రాయలసీమ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తన విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి కోరారు. మంగళవారం ప్రభుత్వ పాఠశాలలో పర్యటిస్తూ.. తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యజ్ఞం వెంకట్‌మాధవ్, సునీత ఉన్నారు.

ప్రభుత్వ ఆశయ సాధనకు కృషి చేద్దాం

ఆలూరు: అవకాశాన్ని అందిపుచ్చుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. స్థానిక ఎల్లార్తి రోడ్డు సమీపంలోని ఇబ్రహీం ఫంక్షన్ హాల్లో ఆస్పరి, దేవనకొండ మండలాలకు చెందిన గృహసారథులు, ప్రజా ప్రతినిధులు, మండల కన్వీనర్లు, గ్రామ వలంటీర్లతో మంగళవారం ఆలూరు మండల కన్వీనర్ వీరేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మంత్రితో పాటు నారాయణ స్వామి, శ్రీనివాసులు, ఎంపీపీలు లక్ష్మీదేవి, ఉమాదేవి, జెడ్పీటీసీలు దొరబాబు, రామకృష్ణ, మల్లికార్జున, పెద్దయ్య, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. గృహసారథులు, మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులతోకలసి ప్రభుత్వ విధి, విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజా సేవ కోసం పాటు పడుతున్న సీఎం జగనన్న ఆశయ సాధనకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు.

టీడీపీ నేతలకు మాటల్లేవ్?

సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తూ తప్పుడు విమర్శలకు దిగుతున్నారని మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వైఎస్సార్‌సీపీ నేతల అంతు చూస్తామని మాట్లాడడం నోటి దురుసుతనం కాదా అని ప్రశ్నించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కోట్ల సుజాతమ్మ ఎమ్మెల్యే కావాలని పగటి కలలు కంటున్నారని అది నెరవేరదన్నారు. రానున్న ఎన్నికల అనంతరం టీడీపీ కార్యాలయాలకు తాళం వేడం ఖాయమని జోస్యం చెప్పారు.



ఆలూరులో మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

పోస్టర్ ఆవిష్కరణ: హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో కొలువుదీరిన గాదిలింగేశ్వరస్వామి ఉత్సవాల పోస్టర్లను ఆలయ పాలక వర్గం కమిటీ సభ్యులతో కలిసి మంత్రి జయరాం ఆవిష్కరించారు. అలాగే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిస్తూ పోస్టర్ విడుదల చేశారు.

దస్తగిరి స్వామి ఉరుసు

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో మంగళవారం గంధంతో ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దస్తగిరి స్వామి వంశీకుల ఇంటి నుంచి గుర్రంపై గంధంను మేళతాళాలతో దర్గాకు తీసుకొచ్చి పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. బుధవారం ఉరుసు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు మస్తాన్‌వలి స్వామి ఉరుసు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో భక్తుల ఇలవేల్పు మస్తాన్ వలి స్వామి ఉరుసు మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి చెక్కభజన ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు. మంగళవారం భక్తిశ్రద్ధలతో స్వామివారికి గంధ సమర్పణ చేశారు. దర్గాను ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానుండటంతో అవసరమైన ఏర్పాట్లు మంగళవారం పూర్తి చేశారు. 9న గురువారం జియారత్‌తో వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ఉచిత రవాణా సౌకర్యం

ఆస్పరి మీదుగా నలకదొడ్డికి ఉరుసు మహోత్సవానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అగ్రహారం బి.గోవిందు, రాజశేఖర్ అనే భక్తులు బొలెరో, ఆటోను ఏర్పాటుచేశారు.

ప్రజాసేవలో జగనన్నకు తోడుగా ఉందాం

వెల్దుర్తి: గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు అందరూ వైఎస్సార్ కుటుంబంలా సమన్వయంతో పనిచేస్తూ ప్రజాసేవలో సీఎం వైఎస్ జగనన్నకు తోడుగా ఉందామని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సమీర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి 50 కుటుంబాలలో ప్రజలకు అందుతున్న పథకాలు, వారి సమస్యలు తెలుసుకుని పార్టీ, ప్రభుత్వం తరపున మరింత చేరువయ్యే విధానాలను స్క్రీన్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల మండల ఇన్‌చార్జ్‌గా సమీర్‌కుమార్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపికైన వారందరూ ఎమ్మెల్యే, సమీర్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డిని గజమాలతో సత్కరించి అభిమానం చాటుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిపక్ష టీడీపీ, పచ్చ మీడియా జగనన్నకు వచ్చిన ప్రజాదరణ చూసి ఓర్వలేక అబద్ధపు రాతలు, పుకార్లను ప్రచారం చేస్తోందని, తిప్పి కొట్టేందుకు ఈనెల 11 నుంచి ప్రతి కుటుంబాన్ని కలిసి ప్రస్తుత పాలన, గత టీడీపీ పాలనలో తేడాలను ప్రజలకు వివరిద్దామన్నారు. జగనన్న తన పాదయాత్రలో ప్రజల కష్టాలు చూసి ఇచ్చిన హామీలు 99 శాతం అమలు పరిచాడని, మరి నారా లోకేశ్ సీఎం అభ్యర్థో కాదో? తెలియకుండా పాదయాత్ర చేసి ప్రజలకేమి చేస్తాడని యద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ తమ గెలుపును అడ్డుకుంటానని అంటున్నాడని, 2019లో ఆయన పోటీ చేసి ఏం అడ్డుకున్నాడో అందరికీ తెలుసన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుంకన్న, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రంగడు, నాయకులు బొమ్మన పెద్దిరెడ్డి, సూదేపల్లె శరభారెడ్డి, అల్లుగుండు శ్రీరాంరెడ్డి, బోయనపల్లె అశోక్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

అడిగిన వారందరికీ 'ఉపాధి'



పి.కోటకొండలో ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ఆలూరు: జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామంలో ఉపాధి పనులను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం స్థానిక సీఎల్‌ఆర్‌సీ కార్యాలయంలో మండలంలోని టీసీ, ఈసీ, ఎఫ్‌ఏలు, సీనియర్ మేట్లతో సమావేశమయ్యారు. పీడీ మాట్లాడుతూ.. గ్రామాల్లో అందరికీ పనులు కల్పించి వలసల నివారణకు కృషి చేయాలని సూచించారు. అలాగే వంద రోజులు పని, కూలీల సంఖ్య 500 మందికి తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో 20 ఎకరాలకు తగ్గకుండా ఉద్యాన పంటలు సాగు చేయించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఏపీఓ కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



గొల్ల రాజేశ్వరి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామానికి చెందిన గొల్ల రాజేశ్వరి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 సాఫ్ట్‌బాల్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. గ్రామానికి చెందిన గొల్ల శ్రీరాములు, మునేశ్వరి దంపతుల కుమార్తె రాజేశ్వరి గోనెగండ్ల కేజీబీవీ స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో క్యాచర్‌గా ప్రతిభ కనపరచి జాతీయస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా మంగళవారం ఆమెతో పాటు పీఈటీ కళ్యాణిని ప్రిన్సిపాల్ విద్యావతి, అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం



మిలటరీ కాలనీ వద్ద నిర్మాణంలో ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని శిల్పా ఎస్టేట్ సమీపం నుంచి మిలటరీ కాలనీ, వెంకటాపురం కాలనీ వరకు రూ.కోటితో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఆయన మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి పరిశీలించారు. అలాగే అయ్యప్ప స్వామి గుడి వెనుక నిర్మించిన సీసీ రోడ్డుతో పాటు సోగనూరు రోడ్డు నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురపాలక సంఘానికి 14వ ఆర్థిక సంఘం కింద మంజూరైన నిధులు రూ.11 కోట్లలో రూ.9 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు, ప్రహరీ తదితర నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీడీపీ ద్వారా నిర్మించనున్న పైప్‌లైన్ల ద్వారా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలు భేష్

నందవరం: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు రాష్ట్రంలో బాగా అమలవుతున్నాయని నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పి. ప్రదీప్‌కుమార్, పి.సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మిట్టసోమపురం, ముగతి గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు, వేతనాలు, పని దినాలు, వైకేపీ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, పింఛన్ల పంపిణీపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో ఉపాధి పనుల్లో భాగంగా చెక్‌డ్యాం, ఫారంపాండ్ పనులు, పీఎంఏజే పథకం కింద మంజూరైన గృహాలను పరిశీలించారు. సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని సర్పంచ్‌లు లక్ష్మీదేవి, విరుపాక్షిరెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వరమ్మ తదితరులు కోరగా నివేదికను కేంద్రానికి పంపుతామన్నారు. వాటర్‌షెడ్ ఏపీడీ సలీంబాషా, ఏపీడీ అలీపీర, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, పీఆర్ ఏఈ జయన్న, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ముగతిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం అధికారులు

యునాని వైద్య శిబిరానికి స్పందన

గోనెగండ్ల: స్థానిక ప్రభుత్వ యునాని వైద్యశాలలో (ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ప్రాంగణం) జాతీయ యునాని దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ, సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వైద్యులు జవాదుల్ హక్, రమేష్, తబసుమ్, ఖాద్రి హాజరై దీర్ఘకాలిక, జీవన శైలి జబ్బులైన కీళ్ల నొప్పులు, గ్యాస్ ట్రబుల్, షుగర్, బీపీ, మొలలు, మలబద్ధకం, సైనసైటిస్, దీర్ఘకాల జలుబు, పొడి దగ్గు, ఆస్త మా, బొల్లి, దురద తదితర వ్యాధులకు 300 మందికి చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది ఖాజాబీ, ఇంది రమ్మ, రజని, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

తుగ్గలి: జాబ్ కార్డు ఉండి పని కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉపాధి పని కల్పిస్తామని ఏపీఓ రామకృష్ణ అన్నారు. మంగళవారం రాంపల్లి, రామలింగాయపల్లితో పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు కూలీ అందుతుందన్నారు. రోజువారి కూలీ రూ.257 అందేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. టీఏ రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్లు రాజు, రమణారెడ్డి, చంద్ర, నాగిరెడ్డి వెంట ఉన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

నందవరం: లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి సూచించారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని మిట్టసోమపురం, నాగలదిన్నె జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులకు సూచించారు. మండలంలో 420 ఇళ్లు మంజూరు కాగా అందులో 120 మంది లబ్ధిదారులు మూడో ఆప్షన్ ఎంచుకున్నట్లు తెలిపారు. మిలిగిన ఇళ్లను లబ్ధిదారులు నిర్మించుకుంటున్నారని, ఇందులో 62 ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, విద్యుత్ దీపాలు, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ గురుస్వామి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రిజ్వానా, పంచాయతీ కార్యదర్శి విజేంద్ర పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే మంచి ఫలితాలు

గోనెగండ్ల: పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వేణుగోపాల్ సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధం కావడంపై పలు సూచనలు చేశారు. విద్యార్థులు భయం, ఆందోళన వీడి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు ఒత్తిడిని అధిగమించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రణాళికను తయారు చేసుకొని చదువుకోవాలని, సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. వంద శాతం ఉత్తమ ఫలితాల కోసం పట్టుదలతో పని చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్లానింగ్ కో-ఆర్డినేటర్ మారుతి, ఎంఈఓ వినోద్ కుమార్, హెచ్‌ఎం నాగభూషణం పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నందవరం: పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని జిల్లా సమగ్రశిక్ష బాలికల శిశు అభివృద్ధి అధికారిణి (జీసీడీఓ) సునీత ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైనింగ్ హాలు, స్టోర్ రూములు, భోజనం, టీచర్స్ డైరీ, పాఠ్య ప్రణాళికలు పరిశీలించారు. విద్యార్థినుల సామర్థ్యాలను పరిక్షించారు. ఏఎల్‌సీఓ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ శైలజ, ఉపాధ్యాయునీలు పాల్గొన్నారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

చిప్పగిరి: మండలంలోని బెల్డోణ గ్రామ సచివాలయాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్ రాజు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి చేరేలా కృషి చేయాలన్నారు. ఈఓపీఆర్డీ సంజన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

నందవరం: ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలని రూరల్ సీఐ మోహన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రోడ్డు నింబంధనలు, ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలకు గురికావొద్దని వాహనదారులకు సూచించారు. సురక్షిత ప్రయాణమే గమ్యం కావాలన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘాల హర్షం

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర దేవాలయాల ట్రస్ట్‌బోర్డ్‌లో ఈసారి నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పిస్తూ రాష్ట్ర గవర్నర్ ద్వారా స్పెషల్ ఆర్డినెన్స్ జారీ చేయించడం పట్ల స్థానిక నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వారు మంగళవారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఆయన నివాసంలో కలిసి సత్కరించి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు మద్దిలేటి, ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, నాయకులు బతకన్న, టీచర్ నాగన్న, లక్ష్మన్న, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సత్కరిస్తున్న నాయీబ్రాహ్మణులు

ప్రత్యేక హోదా కోసం ట్రైసైకిల్ యాత్ర

నందవరం: రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ దివ్యాంగుడు నెయ్యాల ప్రసాద్ ట్రైసైకిల్‌పై ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు చేపట్టిన యాత్ర మంగళవారం నందవరానికి చేరుకుంది. ఈ సందర్భంగా తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ కార్యాలయం వద్ద అధికారుల మద్దతు కోరుతూ వారి నుంచి ధ్రువపత్రాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' ఆయనను పలకరించగా తన స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా, కంచిల్లి మండలం, బురగాం గ్రామమని వివరించాడు. తనకు పోలియో వచ్చి రెండు కాళ్లు చచ్చుబడినట్లు తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వే జోన్ ప్రకటించాలని కోరుతూ 13 జిల్లాల్లోని 193 మండలాల్లో ప్రచారం చేస్తూ మండలాధికారుల నుంచి మద్దతు పత్రాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తన పర్యటన పూర్తి కాగానే ఢిల్లీకి వెళ్లి ప్రధాన మంత్రి నరేంద్రమోదీని కలిసి రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని కోరనున్నట్లు తెలిపాడు. అనంతరం ఎంపీడీఓ, రెవెన్యూ కార్యాలయాల అధికారులు ప్రసాద్‌కు ఆర్థిక సాయం అందించడంతో అక్కడినుంచి బయలుదేరి వెళ్లాడు.



నందవరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద మద్దతు పత్రాలు స్వీకరిస్తున్న దివ్యాంగుడు ప్రసాద్

వైభవంగా మద్దమాంబ రథోత్సవం

మద్దికెర: మండల కేంద్రంలో మద్దమాంబ అమ్మవారి రథోత్సవం మంగళవారం అశేష జనవాహిని మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. అనాది నుంచి వస్తున్న ఆచార సంప్రదాయాన్ని కొనసాగిస్తూ పెద్దనగరి, చిన్ననగరి యాదవ కుటుంబీకులు ప్రత్యేక దుస్తులతో ఇంటి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి రథంలో కొలువుంచారు. భక్తులు మద్దమాంబకు జై అంటూ రథాన్ని ముందుకు లాగారు. భక్తులు అరటి పండ్లను విసిరి భక్తిని చాటుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



మద్దికెరలో అశేష జనవాహిని మధ్య మద్దమాంబ రథోత్సవం

పేదల అభ్యున్నతికి సహకారం

మద్దికెర: పేద ప్రజల అభివృద్ధికి సహకారమందించడమే పోచిమిరెడ్డి సేవాదళ్ స్వచ్ఛంద సేవా సంస్థ ధ్యేయమని నిర్వాహకులు మురళీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మద్దికెరలో సేవాదళ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాటలో పార్టీలకతీతంగా సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. మహిళలకు కుట్టు మిషన్‌లో శిక్షణ ఇవ్వడంతో పాటు నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఆపద్బాంధవ సేవాసమితి అధ్యక్షుడు చౌక్కా సునీల్‌కుమార్, రామాంజులు, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు

వెల్దుర్తి: నవరత్నాలు, సంక్షేమ పథకాల అమలుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం ఆమె వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డితో కలిసి మండల కేంద్రంలోని 15, 16 వార్డులలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరిస్తూ వారికి ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తూ బుక్‌లెట్ అందజేశారు. సీఎం జగనన్న ఇంటి వద్దకే పథకాలన్నీ అందిస్తున్నారని పింఛన్ అందుకుంటున్న వృద్ధులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. స్థానికులు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, వైస్ ఎంపీపీ రంగడు, సర్పంచ్ ముత్యాల శైలజ, దేవరాజ్ దంపతులు, నాయకులు బొమ్మన పెద్దిరెడ్డి, వెంకట్‌నాయుడు, గట్టు ఆరిఫ్, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం చేద్దాం

కృష్ణగిరి: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలతో పాటు, ఇళ్లు నిర్మించి వారి సొంతింటి కల సాకారం చేద్దామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మంగళవారం హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వివక్ష లేకుండా అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 30.75 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. ఇళ్ల విషయంలో ఎవరైనా అవినీతికి పాల్పడితే ఉపేక్షించబోమన్నారు. ఈ ఉగాది నాటికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఇళ్ల నిర్మాణాల్లో బిల్లుల మంజూరుకు వెంటనే సిఫార్సు చేయాలని సూచించారు. హౌసింగ్ డీఈ గురుప్రసాద్, ఎంపీడీఓ మోహన్‌కుమార్, పీఆర్ ఏఈ అబ్దుల్‌వహీద్, ఏఈ హరిప్రతాప్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



వెల్దుర్తిలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మెలకువలు పాటించాలి

హొళగుంద: వేరుశనగ సాగులో సుస్థిర వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాలని ఏఓ నరేంద్రకుమార్, వీఏఏ తస్లీమా సూచించారు. మంగళవారం చిన్నహ్యాట, బీ.జీ హళ్లి గ్రామాల్లో వేరుశనగపై వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఎంపీటీసీ శివన్న, జడ్‌బీఎన్‌ఎఫ్, నాగేష్, సురేష్‌బాబు, నాగరాజు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులు అరికట్టాలి

ఆలూరు రూరల్: డోన్ పట్టణంలో న్యాయవాది పులి దామోదర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు బార్ అండ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వలి, రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు న్యాయవాదులతో కలిసి కోర్టు ముందు ధర్నా చేపట్టారు. దుండగులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక న్యాయవాదులు పాల్గొన్నారు.